ప్రాంతీయ పార్టీలకు బిజెపితో వైరుధ్యాలు

# విశాల ఐక్య వేదికలకు పెరుగుతున్న అవకాశాలు

బి.వి.రాఘవులు

PSBH

ప్రజాశక్తి బుక్‌హౌస్

PSBH

ప్రచురణ సంఖ్య : 1674

ప్రతులు : 10,000

వెల : ₹ 5/-

ప్రతులకు

PSBH

**ప్రజాశక్తి బుక్‌హౌస్**
27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట,
విజయవాడ -2, ఫోన్ : 0866 -2577533

**బ్రాంచీలు**
విజయనగరం, విశాఖపట్నం, కాకినాడ, ఏలూరు, విజయవాడ,
గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, కర్నూలు, అనంతపురం

**ముద్రణ**
ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, విజయవాడ
website : www.psbh.in
prajasaktipublishinghouse@gmail.com

150428

# ప్రాంతీయ పార్టీలకు బిజెపితో వైరుధ్యాలు : విశాల ఐక్య వేదికలకు అవకాశాలు

**మో**డీ నాయకత్వాన బిజెపి రెండవ సారి కేంద్రంలో సంపూర్ణ మెజారిటీతో అధికారాన్ని చేపట్టిన తర్వాత దేశ ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాలను సమూలంగా మార్చాలన్న ప్రయత్నం చాలా దుడుకుగా ప్రారంభమయింది. మిగిలి వున్న ప్రభుత్వ రంగాన్ని వదిలించుకోవాలన్న తహతహతో పని ప్రారంభించింది. పారిశ్రామిక, వ్యవసాయ, విద్యా, రంగాలను కార్పొరేటు సంస్థలకు పణంగా పెట్టడానికి కొత్త చట్టాలను, విధానాలను రూపొందించింది. పౌరసత్వ చట్టాలను సవరించి మతవాద (హిందూత్వ) రాజకీయ ప్రక్రియకు తెరతీసింది. సమాఖ్య వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తూ రాష్ట్రాల ఆర్థిక బలాన్ని, హక్కులను హరించివేస్తున్నది. పౌరహక్కులు, మానవ హక్కులను కాలరాస్తూ న్యాయ, ఇతర స్వతంత్ర వ్యవస్థల ప్రతిపత్తిని బలహీనపరుస్తూ, గవర్నర్ వ్యవస్థను దుర్వినియోగం చేస్తూ ప్రజాస్వామ్యాన్ని తొలిచివేస్తూ నిరంకుశత్వాన్ని పెంచుతున్నది. సంఘపరివారం నినాదాలైన ఒకే మతం, ఒకే జాతి, ఒకే సంస్కృతి అమలుతో పాటు స్వదేశీ, విదేశీ కార్పొరేటు శక్తులు కోరుకుంటున్న ఒకే మార్కెట్టు, ఒకే పన్ను, ఒకే ఎన్నిక వగైరా అంశాల అమలుకు పూనుకున్నది. బడా బూర్జువా వర్గం కార్పొరేట్ శక్తుల (ఇప్పుడు అంబానీ, అదానీల పేర్లతో ఈ వర్గం ప్రాబల్యం పొందింది)కు దేశాన్ని వడ్డించిన విస్తరిగా తీర్చిదిద్దడం మోడీ, బి.జె.పి పాలన లక్ష్యంగా సాగుతున్నది. ఈ సంవత్సర ఆరంభంలో ప్రపంచాన్ని, దేశాన్ని కరోనా విపత్తు ఆవరించింది. దాని ప్రభావంతో అప్పటికే మాంద్యాన్ని ఎదుర్కొంటున్న మన దేశ ఆర్థిక వ్యవస్థ మరింత మాంద్యంలోకి జారిపోయింది. దేశం ఎదుర్కొంటున్న ఈ పరిస్థితి ఒక బాధాకర పరిణామమని భావించకుండా మోడీ ప్రభుత్వం ప్రజలు కరోనా భయాందోళనలో సతమతమవుతున్న

సందర్భాన్ని కార్పొరేటు శక్తులకవసరమైన బహుముఖ సంస్కరణలను వేగంగా అమలుచేయడానికి ఒక సదవకాశంగా భావించింది. కరోనా వైరస్ ప్రజలకు, ప్రజా ఉద్యమాలకు కల్గించిన పరిమితులను వినియోగించుకుని ప్రజాస్వామిక పద్ధతులను పక్కన పెట్టి సంస్కరణలను, చట్టాలను ఆగమేఘాల మీద అమలు చేయడానికి పూనుకున్నది.

అయితే మోడీ ప్రభుత్వం భావించినట్లు అది తలపెట్టిన వినాశకర సంస్కరణలు ప్రజల నుండి ప్రతిఘటన లేకుండా సాగిపోవడం లేదు. 1. పౌరసత్వ సవరణ చట్టానికి, 2. కార్మిక కోడ్‌లకు, 3. నూతన వ్యవసాయ చట్టాలకు, 4. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు, 5. నూతన విద్యా విధానానికి విస్తృతంగా ప్రతిఘటన ప్రారంభమయింది. 6. తాజాగా మోడీ విధానాలకు పెద్ద సవాలుగా దేశవ్యాప్తంగా ప్రారంభమయిన రైతాంగ ఉద్యమం... ఈ ప్రతిఘటనకు సూచికలు. వీటికి తోడు ప్రాదేశికత పునాదిగా వున్న సమాఖ్య వ్యవస్థపై, రాష్ట్రాల హక్కులపై మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రత్యక్ష, పరోక్ష దాడికి కూడా ప్రతిఘటన వివిధ రూపాలలో ఎదురవుతున్నది. నేటి రాజకీయ పరిస్థితులపై ఈ ప్రతిఘటన ప్రభావం ఎలా వుంటుందో అన్న అంశాన్ని క్లుప్తంగా వివరిస్తాను.

1. హిందూత్వ రాష్ట్ర స్థాపన ఆశ, దేశీయ కార్పొరేటు పెట్టుబడి కేంద్రీకత, ఏకఖండ రాజ్యాంగా దేశాన్ని రూపుదిద్దాలన్న కోర్కె - రెండూ ఇప్పుడు మోడీ ప్రభుత్వ రూపంలో ఫెడరల్ వ్యవస్థపై, రాష్ట్రాల హక్కులపై దాడి జరుగుతున్నది.
2. రాజ్యాంగం ప్రకారం రాష్ట్రాల పరిధిలో వున్న అంశాలపై రాష్ట్రాల అంగీకారం లేకుండానే కేంద్రం ఏకపక్షంగా చట్టాలను రూపొందిస్తున్నది.
3. కార్మిక కోడ్‌లు, కొత్త వ్యవసాయ చట్టాలు, నూతన విద్యా విధానం వంటి అంశాలు రాష్ట్ర పరిధిలోనివైనా, కేంద్రం చట్టాలను చేసింది.
4. జిఎస్‌టిని ప్రవేశపెట్టి రాష్ట్రాల ఆదాయ మార్గాలపై దెబ్బకొట్టింది.
5. అనేక పథకాలలో కేంద్రం వాటాను తగ్గించుకుని రాష్ట్రాలపై భారం పెంచుతున్నది. కరోనా వలన కుదేలయిన 'ఆర్థిక పరిస్థితి నుండి బయట పడడానికి రాష్ట్రాలకు తగినంత సహాయం అందించకుండా వేధిస్తున్నది.
6. అప్పు చేసుకోవడానికి కూడా అనుమతినివ్వకుండా అనేక ప్రజా వ్యతిరేక షరతులను విధిస్తున్నది.

మన ఫెడరల్ వ్యవస్థలో రాష్ట్రాలకున్న పరిమితమైన స్వయం ప్రతిపత్తిని కూడా ధ్వంసం చేస్తున్నది. 370 అధికరణాన్ని రద్దు చేసి జమ్ము-కాశ్మీర్‌ను ముక్కలు

చేసి రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించింది.

తాజాగా కేరళ గవర్నర్ రాష్ట్ర ప్రభుత్వం పనికి ఎలా అడ్డం పడ్డారో చూడవచ్చు. బెంగాల్‌లోని ముగ్గురు ఐపిఎస్ అధికారులను రాష్ట్ర ప్రభుత్వ అంగీకారం లేకుండా కేంద్ర సర్వీసుకు మార్చాలని కేంద్రం దురుసుగా వ్యవహరించింది. గతంలో అధ్యక్ష తరహా పరిపాలన ప్రతిపాదనను ముందుకు తెచ్చిన బిజెపి ఇప్పుడు జమిలి ఎన్నికలు (పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి జరపడం) గురించి చర్చకు తెర లేపింది. ఎంతో వైవిధ్యం కల్గిన రాష్ట్రాలను అణచివేసి దేశం మొత్తాన్ని ఒకే కేంద్రీకృత నిరంకుశ పాలన క్రిందకు తీసుకురావాలన్న కుట్ర ఈ ప్రతిపాదన వెనక దాగివున్నది.

మన సమాజం అనేక రాష్ట్రాలు, ప్రాంతాలు, భాషలు, మతాలు, కులాలు, తెగలు వగైరా కలిగి వైవిధ్యభరితంగా వుంటుంది. ఆయా తరగతుల, ప్రాంతాల ప్రత్యేక ప్రయోజనాలు, ఆకాంక్షలు వివిధ రాజకీయ పార్టీలు, సంస్థలు, శక్తుల ద్వారా ప్రస్తుతం వ్యక్తం అవుతున్నాయి. ఈ వైవిధ్యం ప్రజాస్వామిక వ్యవస్థల్లో వ్యక్తం గాకుండా నిరోధించేందుకే మోడీ ప్రభుత్వం ఫెడరలిజం మీద చేస్తున్న దాడి తోడ్పడుతుంది. ఇది తీవ్ర పరిణామాలకు దారితీస్తుంది.

సిఎఎ మైనారిటీలను అభద్రతా భావానికి గురిజేస్తున్నది. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త వ్యవసాయ చట్టాలు ధనిక రైతులతో సహా రైతాంగానికంతటికి నష్టం చేస్తాయి. మోడీ విధానాలు వేళ్ళ మీద లెక్క పెట్టగలిగిన కార్పొరేటు సంస్థలు మరింత పెద్దవి కావడానికి మాత్రమే ఉద్దేశించబడ్డాయి. ఇవి చిన్న మధ్యతరహా పరిశ్రమలు, వ్యాపారాలు దెబ్బ తినడానికి దారి తీస్తాయి. ప్రభుత్వం అమలుచేస్తున్న విద్యుత్తు చట్టం రైతాంగానికి, చిన్న పరిశ్రమలకు గొడ్డలి పెట్టు కానున్నది.

ప్రాంతీయ పెట్టుబడిదారుల, ధనిక రైతుల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతీయ పార్టీలు సహజంగానే మోడీ ఫెడరలిజం మీద సాగిస్తున్న దాడితో ఆందోళనకు గురవుతున్నాయి. ఆ పార్టీలలో అసంతృప్తి పెరుగుతున్నది. అవకాశం వచ్చినపుడు దాన్ని వ్యక్తం చేస్తున్నాయి. ఎన్‌డిఎకి భాగస్వాములుగా వున్న అకాలీదళ్, శివసేన, ఎల్‌జెపి పార్టీలు ఈ మధ్య కాలంలో బిజెపికి దూరమయ్యాయి.

టిఆర్ఎస్, వైఎస్ఆర్‌సిపిలు డిసెంబర్ 8 భారత్ బంద్‌కు మద్దతు ఇవ్వడం వెనక పరోక్షంగా కేంద్రం పెత్తనంపై అసంతృప్తి వున్నది. టిఎమ్‌సి, ఎస్.పి, బిఎస్‌పి, బిజెడి, ఎన్‌సిపి వంటి పార్టీలు మోడీ ప్రభుత్వం ఫెడరలిజంపై చేస్తున్న దాడిని గట్టిగా వ్యతిరేకిస్తున్నాయి. అయితే ప్రాంతీయ పార్టీల వ్యతిరేకత ఒకే ప్రవాహంగా

మారి బిజెపి నియంతృత్వ పోకడలను నేరుగా ప్రతిఘటించే స్థాయికి ఇంకా రాలేకపోవడం ఒక బలహీనత. బడా బూర్జువా వర్గ పార్టీ అయిన కాంగ్రెస్ కూడా ఇప్పుడు కొన్ని రాష్ట్రాలలో ప్రభుత్వాలను నిర్వహిస్తూ రాష్ట్రాల హక్కుల గురించి, ఫెడరలిజం గురించి మాట్లాడాల్సి వస్తున్నది.

ప్రాంతీయ పార్టీలు ఫెడరల్ వ్యవస్థ పరిరక్షణ కోసం నిలబడడంలో పరిస్థితులను బట్టి ఊగిసలాట వైఖరులు తీసుకోవడం మన దృష్టిలో ఉండాలి.

1960వ దశకంలో అకాలీదళ్, డియంకె మాత్రమే ప్రాంతీయ పార్టీలు. 1980, 90 దశకంలో వివిధ రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలు పెద్ద సంఖ్యలో ఆవిర్భవించాయి. పారిశ్రామిక వ్యవసాయ విధానాలు (హరిత విప్లవం, ప్రభుత్వ రంగం, ఉన్నత విద్య, రిజర్వేషన్లు వగైరా) గ్రామసీమలలో ఒక బలమైన ధనిక రైతు తరగతిని, వివిధ సామాజిక తరగతుల్లో నుండి మధ్యతరగతిని అభివృద్ధి చేశాయి. ఈ శక్తులు రాజకీయాలలో వాటా సాధించడం ద్వారా స్థానిక వనరులు, అవకాశాలపై తమపట్టు పెంచుకోవడానికి పూనుకున్నాయి. ఆనాడు అధికారంలో వున్న కాంగ్రెస్ ఆధిపత్య ధోరణి, ఏకపార్టీ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఈ శక్తులు ప్రాంతీయ పార్టీల రూపంలో రాజకీయాల్లో ప్రవేశించాయి. ఈ పార్టీలు ఆనాటి కాంగ్రెస్ నిరంకుశ, ఫెడరల్ వ్యతిరేక పోకడలను గట్టిగా ఎదిరిస్తూ నిలిచాయి. 1980 దశకంలో జరిగిన ప్రతిపక్ష పార్టీల కాంక్లేవ్ సమావేశాలు దీనికి తార్కాణాలు.

1991లో సరళీకరణ విధానాలు ప్రారంభమయిన తర్వాత ప్రపంచ బ్యాంకు నేరుగా రాష్ట్రాల్లో సంస్కరణల అమలు కోసం రుణ ఒప్పందాలు కుదుర్చుకోవడం మొదలు పెట్టడంతో ప్రాంతీయ బూర్జువా వర్గ వైఖరిలో మార్పు వచ్చింది. కొత్తగా వచ్చిన అవకాశాలను ఉపయోగించుకోవడానికి కేంద్రంతో సానుకూలంగా వ్యవహరించడం అవసరమని భావించాయి. ఈ మార్పుకు అనుగుణంగా ప్రాంతీయ పార్టీల వైఖరిలోనూ మార్పు వచ్చింది. అలాగే 1980 దశకం నుండి కేంద్ర స్థాయిలో ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వాలలో ప్రాంతీయ పార్టీలు ముఖ్య పాత్ర నిర్వహించే అవకాశం వచ్చింది. విధానపరమైన ప్రాతిపదిక కాకుండా పార్టీ అధికార ప్రయోజనాన్ని బట్టి కేంద్రంలో బిజెపితో సహా ఎవరితోనైనా జత కట్టడానికి ప్రాంతీయ పార్టీలు వెనుకాడ్డం లేదు.

అయితే ఇప్పుడు మోడీ నాయకత్వాన బిజెపి రెండవసారి అధికారంలోకి రావడంతో పరిస్థితి మారింది. బిజెపికి సంపూర్ణ మెజారిటీ వచ్చింది. కేంద్ర ప్రభుత్వం మనడానికి ప్రాంతీయ పార్టీల మద్దతు అవసరం లేదు. ఇప్పుడు మోడీ ప్రభుత్వం కార్పొరేటు శక్తులను పెంచడమే దేశాన్ని అభివృద్ధి చేయడంగా నిర్ణయించుకుని సరళీకరణ సంస్కరణలను వేగవంతం చేసింది. ఈ విధానాలు మొత్తం రైతాంగానికి,

చిన్న, మధ్య తరహా, ప్రాంతీయ పెట్టుబడిదారులకు నష్టదాయకంగా మారాయి. కేంద్రప్రభుత్వం మాదిరిగా కాక, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమ చర్యలను అమలు చేసే విషయంలో ప్రజలకు నేరుగా అనునిత్యం జవాబుదారీగా వుండవలసి వస్తున్నది. ఈ కారణం వలన కూడా రాష్ట్ర ప్రభుత్వాలు నడుపుతున్న పార్టీలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. తమ ప్రజాపునాదిని కాపాడుకోడానికి బిజెపిని ఎదుర్కోవడం నానాటికీ ప్రాంతీయ పార్టీలకు అనివార్యం అవుతున్నది. అందుకే ప్రాంతీయ బూర్జువా పార్టీలకు, బిజెపికి మధ్య వైరుధ్యం పెరిగింది.

ఈ పరిస్థితి మతోన్మాద బిజెపికి వ్యతిరేకంగా పోరాడడానికి ఒక కొత్త అవకాశాన్ని కల్పిస్తున్నది. సమాఖ్య వ్యవస్థ, రాష్ట్రాల హక్కుల కోసం పోరాటాన్ని ముందుకు తీసుకురావడం ద్వారా ప్రాంతీయ పార్టీల అవకాశవాదాన్ని అధిగమించి, బిజెపి మతోన్మాద వ్యతిరేక శక్తుల విశాల ఐక్యతను నిర్మించే అవకాశం బలపడుతుంది.

అయితే బిజెపిని ఎదుర్కోవాలంటే ప్రాంతీయ పార్టీలు ప్రస్తుత నయా ఉదారవాద విధానాల నుంచి పక్కకు మళ్ళి ప్రత్యామ్నాయ విధానాలను రూపొందించుకోవాలి. రాష్ట్రాల హక్కులు, పన్నుల ఆదాయాల్లో వాటాలు, తదితర విషయాలకు సంబంధించి ప్రత్యామ్నాయ విధానాలను, నినాదాలను అవి ముందుకు తేవలసి వుంటుంది. కాని వాటి వర్గ స్వభావరీత్యా ఈ పనిని ప్రాంతీయ పార్టీలు ఏ మేరకు చేపట్టగలుగుతాయన్నది ప్రశ్నార్థకమే. ఈ విషయంలో ఆ పార్టీలలో అంతర్మథనం, ఘర్షణ జరగాల్సి వుంటుంది. ఆ ఘర్షణను ప్రజానుకూల దిశగా మళ్లించడంలో మన పాత్ర ప్రభావం ఉండాలి.

ఈ పరిస్థితుల్లో మన పార్టీ, ప్రజాసంఘాలు కలిసి వచ్చే ఇతర వామపక్ష పార్టీలను కలుపుకుని ప్రజా సమస్యలపై రాష్ట్రాల హక్కులపై క్యాంపెయిన్‌లను శక్తివంతంగా చేపట్టాలి. ఆ ప్రచారాన్ని ప్రాంతీయ పార్టీల శ్రేణుల్లోకి విస్తృతంగా తీసుకుపోవాలి. ఆ ప్రచారం ప్రధానంగా బిజెపి మీద ఎక్కుపెట్టాలి. ఈ క్రమంలో ప్రత్యామ్నాయ విధానాలను కూడా (రైతు ఉద్యమం ముందుకు తెచ్చిన తీరుగా) మనం గట్టిగా చర్చలోకి తీసుకురావాలి. ఇటువంటి జోక్యం ద్వారా మాత్రమే మనం ప్రాంతీయ పార్టీల అవకాశవాదాన్ని అధిగమించేలా ఎంతో కొంత ప్రభావితం చేయగలం.

**ప్రజాశక్తి, 31.1.2021**

# రాష్ట్రానికి ద్రోహం చేసే బిజెపితో వైసిపి, తెలుగు దేశం రాజీ ఎందుకు?

**ఆ**ంధ్రప్రదేశ్‌లో రాజకీయాలు ప్రమాదకర ధోరణిలో సాగుతున్నాయి. రాష్ట్రాభివృద్ధిని, ప్రజా ప్రయోజనాలను విస్మరించి, కేంద్రంలోని మతోన్మాద బి.జె.పి ప్రభుత్వ అడుగులకు మడుగులొత్తడానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, తెలుగుదేశం, జనసేన పార్టీలు పోటీ పడుతున్నాయి. అధికారంలో వున్నా, ప్రతిపక్షంలో వున్నా బి.జె.పి పంచన చేరడంలో వీటి మధ్య తేడా ఏమీ లేదు. తెలుగు ప్రజలు రెండు రాష్ట్రాలుగా చీలిపోవడమే బాధాకరమనుకుంటే, నూతన ఆంధ్రప్రదేశ్ ఏర్పడి గడిచిన ఆరేళ్ళలో అధికార ప్రతిపక్షాలు రాష్ట్రాభివృద్ధిని విస్మరించి వ్యవహరించడం క్షమించరాని నేరం.

2014లో రాష్ట్ర విభజన సందర్భంలో కొత్త రాష్ట్రానికి 'ప్రత్యేక హోదా' ఇస్తామని కేంద్రం చెప్పింది. తాము కేంద్రంలో అధికారానికి వస్తే పది సంవత్సరాలు 'ప్రత్యేక హోదా' కొనసాగిస్తామని ఆనాడు బిజెపి ప్రకటించింది. తర్వాత అధికారానికి వచ్చిన బిజెపి మోడీ నాయకత్వాన ఆరు సంవత్సరాల నుండి పరిపాలిస్తూ వాగ్దాన భంగంచేసి రాష్ట్రానికి ద్రోహం చేసింది. ఆనాడు పార్లమెంటు ఆమోదించిన విభజన చట్టంలో అనేక వాగ్దానాలు చేయబడ్డాయి. రాజధాని నిర్మాణానికి, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి తగినన్ని నిధులిస్తామని, కడప స్టీలుప్లాంటు, కాకినాడ నూనెశుద్ధి కర్మాగారం, దుగరాజపట్నం ఓడరేవు నిర్మాణం, విశాఖ రైల్వేజోను ఏర్పాటు వంటి అనేక వాగ్దానాలివ్వబడ్డాయి. కేంద్రం కొన్ని వాగ్దానాల నుండి వెనక్కి పోయింది, మరి కొన్నింటికి అరకొర నిధులిచ్చి చేతులు దులుపుకుంది.



బి.జె.పి కేంద్ర ప్రభుత్వం చేసిన వాగ్దానాలను, విభజన చట్ట నిర్ణయాలను కాలరాస్తుంటే తెలుగుదేశం, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలు మిన్నకున్నాయి. అస్త్ర సన్యాసం చేసి, బి.జె.పి ప్రాపు కోసం పాకులాడుతున్నాయి. కొత్త రాష్ట్రంలో మొదటి ఎన్నికల్లో గెల్చి తెలుగుదేశం అధికారానికి వచ్చింది. కేంద్రంలో బి.జె.పితో అధికారం పంచుకుంది. రాష్ట్రంలో బి.జె.పికి మంత్రివర్గంలో చోటిచ్చింది. ఆ రకంగా బి.జె.పితో చెట్టాపట్టాలేసుకుని తిరిగింది తప్ప రాష్ట్ర ప్రయోజనాలను సాధించేందుకు పూనుకోలేదు. బి.జె.పి ద్రోహాన్ని వెనకేసుకొచ్చి నాలుగు సంవత్సరాలపాటు ప్రజలను మభ్య పెట్టేందుకు పూనుకున్నది. ప్రజాగ్రహానికి గురవుతామని భయపడి ఎన్నికల ముందు బిజెపితో తెగతెంపులు చేసుకున్నప్పటికీ 2019 ఎన్నికల అనంతరం, మళ్ళీ ప్లేటు మార్చి బిజెపికి అనుకూలంగా మారింది. అన్ని సందర్భాలలోనూ సంపూర్ణంగా మద్దతిస్తున్నది. కొత్తగా ఇప్పుడు బిజెపి మత రాజకీయాల రంగును పులుముకునే ప్రయత్నం చేస్తున్నది.

ఆనాడు ప్రతిపక్షంలో వున్న వైఎస్ఆర్ పార్టీ మాట వరసకు స్పెషల్ స్టేటస్ కావాల్సిందే అని ప్రకటనలు చేసినా, కేంద్ర బిజెపి మీద ఈగ వాలనివ్వకుండా వ్యవహరించింది. బిజెపి ద్రోహాన్ని ప్రశ్నించడానికి పూనుకోలేదు. పార్లమెంటులో అన్ని కీలక సందర్భాలలో బిజెపికి మద్దతుగా నిలబడింది. విచిత్రమేమంటే బిజెపి ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ భాగస్వామిగా వున్నా వైఎస్ఆర్ పార్టీకి ఎటువంటి అభ్యంతరం లేకపోయింది. బిజెపి పట్ల వైఎస్ఆర్ పార్టీకి వున్న భయం లేదా భక్తి, తెలుగుదేశం భాగస్వామ్య ప్రభుత్వాన్ని సమర్థించే స్థితికి ఆ పార్టీని దిగజార్చింది.

2014 ఎన్నికల ముందు ప్రారంభమైన జనసేన... బిజెపి, తెలుగుదేశం సేవతో మొదలుపెట్టి మధ్యలో స్పెషల్ స్టేటస్ కోసం వామపక్షాలతో కలుస్తున్నామని చెప్పి... 2019 ఎన్నికల అనంతరం గురువుని మించిన శిష్యుడి లాగా బిజెపి మత రాజకీయాలను భుజాన వేసుకుని తిరుగుతోంది.

రాజధాని నిర్మాణానికి కేంద్రం ఇస్తానన్న నిధులను రాబట్టుకొని నూతన రాష్ట్రానికి నూతన రాజధానిని సత్వరం పూర్తిచేసుకుందామన్న ధ్యాస అధికార, ప్రతిపక్ష పార్టీలకు ఏ కోశానా కనబడలేదు. కేంద్రంలో భాగస్వామిగా వుండి కూడా అనాడు తెలుగుదేశం అవసరమైన నిధులు రాబట్టలేదు. అమరావతిలో రాజధాని నిర్మాణాన్ని తెలుగుదేశం పెద్ద రియల్ ఎస్టేట్ బిజినెస్‌గా మార్చింది. రాష్ట్ర రాజధానికి అవసరమైన సౌకర్యాల నిర్మాణంపై కేంద్రీకరించి తొందరగా పూర్తిచేయకుండా అసాధ్యమైన, ఊహాజనితమైన ప్రణాళికలను ప్రకటలను చేస్తూ కాలక్షేపం చేసింది. సిపిఐ(ఎం), వామపక్షాలు ఆనాడు చెప్పిన విధంగా నాలుగయిదు వేల ఎకరాల స్థలంలో ప్రభుత్వ పాలనా కేంద్రం నడవడానికి అవసరమైన సౌకర్యాల నిర్మాణంపై దృష్టి పెట్టివుంటే ఈ పాటికి రాజధాని పూర్తయి వుండేది. వేలాది మంది రైతు, కూలీలు రోడ్డున పడేవారు కాదు. రియల్ ఎస్టేట్ కుంభకోణాలకు అవకాశం వుండేది కాదు. వైఎస్ఆర్ పార్టీ నేడు ముందుకు తెచ్చిన 'మూడు ముక్కల' సిద్ధాంతానికి అవకాశం ఉండేది కాదు. అమరావతిని రాజధానిగా ప్రతిపక్షంలో వున్నప్పుడు అంగీకరించి ఎన్నికల్లో ప్రజల ముందు చెప్పి అధికారానికి వచ్చిన తర్వాత వైఎస్ఆర్ పార్టీ ప్లేటు మార్చి రాష్ట్ర రాజధానిని వివిధ ప్రాంతాలకు వికేంద్రీకరించాలన్న వివాదాస్పద నిర్ణయం తీసుకున్నది. కొత్త రాష్ట్రాభివృద్ధికి పూర్తి స్థాయి రాజధాని సత్వరం ఏర్పడడం, అందరికి అందుబాటులో వుండే కేంద్రంలో రాజధాని వుండడం అవసరం అన్న అంశం అధికార పార్టీకి పట్టలేదు. అధికార ప్రతిపక్ష పార్టీలు తమ తమ చవకబారు రాజకీయాలతో ఆరేళ్ళయినా రాజధాని ఏర్పడకపోవడం పట్ల ఏ చింతా కనపరచడం లేదు. తగినన్ని నిధులు సమకూర్చకుండా కేంద్ర బిజెపి కాలయాపన చేయడాన్ని విస్మరించి ఈ రెండు పార్టీలు తంపులు పడుతున్నాయి.

రాష్ట్రంలో వ్యక్తిగత నిందలు, దూషణలతో, స్వల్ప విషయాలపై కోట్లాడుకోవడంలో తలమునకలవుతున్న అధికార వైఎస్ఆర్‌సి పార్టీ, ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీలు, మతతత్వ కేంద్ర బిజెపి, దుష్పరిపాలనను భుజాన మోసుకు తిరగడానికి ఒకే మార్గంలో పోవడానికి పోటీ పడుతున్నాయి. కేంద్రం కార్మిక హక్కులు కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకు వచ్చింది. వీటిని రెండు

పార్టీలూ సమర్థించాయి. రైతాంగం, ముఖ్యంగా పేద మధ్య తరగతి రైతాంగాన్ని దెబ్బ తీసే రైతాంగ చట్టాలకు రెండు పార్టీలు కళ్లు మూసుకుని మద్దతు ఇచ్చాయి. ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా ప్రవేటు సంస్థలకు అప్పగించే ప్రతిపాదనలను రెండు పార్టీలూ ఆలింగనం చేసుకున్నాయి. స్టీల్ ప్లాంటు, రక్షణ సంస్థలు, బ్యాంకులు, ఇన్సూరెన్సు, రైల్వే వంటివి ప్రైవేటు పరం కావడానికి రెండూ తలాడించాయి. ఈ చర్యలు దేశ స్వావలంబనకు, బలహీన వర్గాల రిజర్వేషన్లకు చావు దెబ్బ కొట్టబోతున్నా వీటికి పట్టలేదు. గిరిజనుల, అటవీ హక్కులను కాలరాసే కొత్త పర్యావరణ అంచనా విధానాన్ని అంగీకరించాయి. బలహీన వర్గాలకు విద్యను దూరం చేసే నూతన విధానాన్ని ఆహ్వానించాయి. రాష్ట్రంలోని 25 లక్షల మంది బోర్‌వెల్ రైతులు పొందుతున్న ఉచిత విద్యుత్‌కు, సామాన్య వినియోగదార్లు అనుభవిస్తున్న క్రాస్ సబ్సిడీ పద్ధతికి మంగళం పాడే కొత్త విద్యుత్ చట్టాన్ని సమర్థించాయి. ఈ చట్టాన్ని వ్యతిరేకించకపోవడం అటుంచి, దేశంలో అందరికంటే ముందుగా మీటర్లు బిగించడానికి వైఎస్‌ఆర్‌సిపి ప్రభుత్వం పూనుకోవడం బిజెపిని సంతృప్తిపరచడానికి ఎంత దూరమైనా వెళ్తుందని స్పష్టం చేస్తున్నది. కరోనా విపత్తును ఎదుర్కోవడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైనా, ఆర్థిక మాంద్యంలో సామాన్యుల జీవితం ఛిన్నాభిన్నమైనా, రాష్ట్రాలకు ఇవ్వాల్సిన జిఎస్‌టి బకాయిలు చెల్లించకపోయినా, 370వ అధికరణాన్ని రద్దు చేసి, పౌరసత్వ చట్టానికి సవరణలను తెచ్చి మైనార్టీలపై లౌకిక విలువలపై దాడి చేస్తున్నా అధికార, ప్రతిపక్ష పార్టీలు నోరు మెదపడం లేదు. బిజెపి పాలనలో దళితులు, మహిళలు, మైనారిటీలపై అత్యాచారాలు, దాడులు పెరుగుతున్నా మత వైషమ్యాలు రెచ్చగొట్టే యత్నాలు జరుగుతున్నా ప్రజాస్వామ్య హక్కులకు భంగం వాటిల్లుతున్నా వీటికి పట్టలేదు.

అధికారాన్ని చేపట్టిన తర్వాతనైనా రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ వ్యవహరించడంలేదు. రాష్ట్రాల అధికారాలను కాలరాస్తుంటే ప్రశ్నిస్తున్న ఇతర రాష్ట్ర ప్రభుత్వాలతో ఐక్యంగా వ్యవహరించడం లేదు. నవరత్నాల పేరుతో తాను అమలుచేస్తున్న తాత్కాలిక ఉపశమన చర్యలే సరిపోతాయని ప్రభుత్వం భ్రమలో వున్నట్లుంది. ప్రజలకు ఉపశమనం కల్పించే కొన్ని పథకాల అమలు అవసరమే. కాని ప్రజలు సొంత కాళ్ల పైన ఆత్మ గౌరవంతో బతకాలంటే అవి చాలవు. కార్మికులు, ఉద్యోగులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, జీతాల చెల్లింపు అవసరం. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని పట్టణాలకు విస్తరించడం, నిరుద్యోగులకు భృతి ఇవ్వడం, వ్యవసాయ కార్మికులకు కనీస వేతనం చెల్లింపు, పేదలకు గృహ కల్పన, ప్రజారోగ్యం,

విద్యా సదుపాయాల మెరుగుదల, కౌలుదార్లకు రక్షణ–పరపతి ఏర్పాటు, ఆదివాసులకు–అటవీ హక్కులకు రక్షణ, విద్యుత్ చట్ట సవరణల అమలు నిరాకరణ, ఇతర రాష్ట్రాలతో కలిసి సమాఖ్య విధానాన్ని రక్షించడం, మతతత్వ శక్తులను నిరోధించడం చెయ్యాలి. ఈ అంశాలపై ఎన్నికల్లో చేసిన వాగ్దానాలనైనా అమలు చేయాలి. కాని రాష్ట్ర ప్రభుత్వం వాటిని మరచిపోయింది.

రాష్ట్రంలో తెలుగుదేశం, వైఎస్ఆర్‌సిపి, జనసేనలు తెలుగు ప్రజల ఆత్మాభిమానం, ఆత్మగౌరవం గురించి మాట్లాడుతుంటాయి. 'మాట తప్పం, మడమ తిప్పం' అని ప్రగల్భాలు పలుకుతుంటాయి. కాని దురదృష్టం ఏమిటంటే నేడు ఈ పక్షాలన్నీ కేంద్ర బిజెపి ప్రభుత్వ గుప్పెట్లో తోలు బొమ్మలాట రాజకీయాలను ఆడడానికి ఏ మాత్రం సిగ్గు పడడం లేదు.

ఈ పరిస్థితి రాష్ట్ర రాజకీయాల్లో ఆందోళనకరమైన అంశం. అధికార, ప్రతిపక్ష ప్రాంతీయ పార్టీలు బిజెపి ప్రమాదాన్ని ఉపేక్షిస్తున్నాయి. రాష్ట్రానికి, రాష్ట్ర ప్రజలకు బిజెపి చేస్తున్న ద్రోహాన్ని ఎండగట్టకుండా, ఎదుర్కోకుండా దానికి కాళ్ళు తెస్తున్నాయి. ఈ పార్టీల అవకాశవాదాన్ని వినియోగించుకుని రాష్ట్రంలో బలం పుంజుకోవాలని బిజెపి కలలు కంటున్నది. ఈమధ్య రాష్ట్రాన్ని సందర్శించిన ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ తమ సంస్థను రాష్ట్రంలో విస్తరించాలని పిలుపునిచ్చారు. ఈ ప్రమాదాన్ని లౌకిక పార్టీలుగా చెప్పుకుంటున్న తెలుగుదేశం, వైఎస్ఆర్‌సిపి, జనసేన పార్టీలు పట్టించుకోకుండా వదిలేస్తే వామపక్షాలు తమ శక్తి మేరకు బిజెపి సంఘపరివార్ ప్రమాదకర విధానాలను ఎదిరించి పోరాడుతున్నాయి. రాష్ట్రాభివృద్ధికి అవసరమైన ప్రత్యేక హోదా అమలు గురించి ఆందోళనలు చేస్తున్నాయి. కరోనా విపత్తు, ఆర్థిక మాంద్యం వలన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి జేస్తున్నాయి.

ఇప్పటి వరకు సంఘపరివార్, బిజెపి దుష్కృత్యాలకు మన రాష్ట్రం దూరంగా ఉంది. మనం ఉపేక్షిస్తే ఈ పరిస్థితి ఇలాగే ఉంటుందనుకోలేం. అంతర్వేదిలో దేవాలయ రథాన్ని దుండగులు దహనం చేసిన ఘటనను ఉపయోగించుకుని రాష్ట్ర వ్యాప్తంగా మత విద్వేషాన్ని రెచ్చగొట్టేందుకు బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు చేసిన ప్రయత్నం ఆ ప్రమాదం గురించి హెచ్చరిస్తున్నది. బిజెపితో అంటకాగుతున్న పార్టీలు మతతత్వ శక్తులను ప్రతిఘటించి రాష్ట్రాభివృద్ధిని, ప్రజల ప్రయోజనాలను రక్షిస్తాయని అనుకోలేం. ఇందుకు వామపక్షాలు, అభ్యుదయ లౌకికవాదులు, ప్రజా, సామాజిక సంస్థలు సమైక్యంగా పూనుకోవాలి. ఇదే మన ముందున్న మార్గం.

**ప్రజాశక్తి, 24.10.2020**

# ప్రాంతీయ పార్టీల ముందున్న సవాల్..!

**ము**గిసిన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) ఎన్నికల్లో బిజెపి చాలా తీవ్ర స్థాయిలో ప్రచారం సాగించింది. దుబ్బాక ఉప ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర సమితి (టిఆర్ఎస్)ని ఓడించి కైవసం చేసుకున్న విజయంతో బిజెపి అత్యంత విషపూరితమైన మత ప్రచారాన్ని నిర్వహించింది. ఈ ప్రచార పర్వంలో అమిత్ షా నుండి ఆదిత్యనాథ్ వరకు జాతీయ స్థాయి నాయకత్వం అంతా పాల్గొంది. టిఆర్ఎస్కు, ముఖ్యమంత్రి కెసిఆర్కు వ్యతిరేకంగా బిజెపి ఈ ప్రచారాన్ని సాగించింది. వంశ పారంపర్య రాజకీయాలు నడుపుతున్నారని, అవినీతికి పాల్పడ్డారని, గత అసెంబ్లీ, లోక్సభ ఎన్నికల్లో ఎఐఎంఐఎంతో పొత్తు పెట్టుకుని ముస్లింల పట్ల బుజ్జగింపు ధోరణులకు దిగారని వారిపై ఆరోపణలు చేసింది. ఇక్కడ బిజెపి ఉద్దేశ్యం చాలా స్పష్టంగా వుంది. తామొక్కరమే ప్రత్యామ్నాయమని చెప్పడానికి గానూ టిఆర్ఎస్, దాని అధినేతలను లక్ష్యంగా చేసుకోవడానికి ఈ కార్పొరేషన్ ఎన్నికలను బిజెపి ఉపయోగించుకుంది. టిఆర్ఎస్, దాని నాయకత్వం ఈ దాడికి విస్మయ పడినట్లయితే తమను తామే నిందించుకోవాల్సి వుంటుంది.

2014లో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి మోడీ ప్రభుత్వాన్ని వ్యతిరేకించరాదన్న వైఖరిని టిఆర్ఎస్ అనుసరించింది. పార్లమెంట్లో అనేక ప్రజాస్వామ్య వ్యతిరేక చట్టాలకు మద్దతిచ్చింది. అంతేకాదు, బిజెపి హిందుత్వ ఎజెండా గురించి ఉద్దేశ్యపూర్వకంగానే మౌనం పాటించింది. ఇందులో ఒకే ఒక్క మినహాయింపు ఏమిటంటే పౌరసత్వ సవరణ బిల్లుకు మాత్రం తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేసింది.

ఇప్పటికే అధ్వాన్న స్థితిలో వున్న కాంగ్రెస్‌పై తన ఆగ్రహావేశాలను వ్యక్తం చేయడంపైనే మొత్తంగా దృష్టి కేంద్రీకరించిన టిఆర్ఎస్ తెలంగాణలో బిజెపి మరింత ముందుకెళ్ళడానికి అనుమతించింది. 2019 లోక్‌సభ ఎన్నికలు ఆనాడే ఒక హెచ్చరికను ఇచ్చాయి. తెలంగాణలో బిజెపి నాలుగు సీట్లను గెలుచుకుంది, దాదాపు 20 శాతం ఓట్లను పొందింది.

టిఆర్ఎస్ ఎదుర్కొంటున్న ఇటువంటి సంకట పరిస్థితులనే ఇతర ప్రాంతీయ పార్టీలూ ఎదుర్కొంటున్నాయి. అధికారంలో వున్నా లేకపోయినా ప్రాంతీయ పార్టీలన్నింటిది ఇదే తీరు. ప్రజల్లో తమకు గల మద్దతును తుడిచి పెట్టేందుకు లేదా హిందూత్వ శక్తులకు లొంగి వుండే మిత్రపక్షాలుగా తమని మిగిలేలా చేయగల ముప్పును ప్రాంతీయ పార్టీలు ఎదుర్కొంటున్నాయి.

ప్రాంతీయ పార్టీల్లో చాలా వరకు స్వభావరీత్యా లౌకిక పార్టీలుగానే ప్రకటించుకున్నా, వాటి అవకాశవాదం, తరచుగా రాష్ట్ర రాజకీయాల కారణంగా గత రెండు దశాబ్దాల కాలంలో ఏదో ఒక సమయంలో బిజెపితో లేదా ఇతరులతో పొత్తు పెట్టకుంటూనే వచ్చాయి. ఆర్‌జెడి, సమాజ్‌వాది పార్టీలను మినహాయిస్తే, ఈ పార్టీలన్నీ వివిధ సమయాల్లో బిజెపితో పొత్తు పెట్టుకున్నాయి. ఈ పార్టీలకు ఏమైందన్నది అసోం గణ పరిషత్‌ను చూస్తే చక్కగా అర్ధమవుతుంది. 2001 అసెంబ్లీ ఎన్నికల్లో ఎజిపి మొదటసారిగా బిజెపితో పొత్తు పెట్టుకుంది. అప్పటి నుండి, బిజెపితో పొత్తు పెట్టుకుని, పెట్టుకోకుండా సాగించిన రాజకీయాలతో ప్రజల్లో తనకు గల పునాదిని నెమ్మదిగా పోగొట్టుకుంటూ వచ్చింది. ఇక చివరగా మొత్తం బిజెపి పరమైపోయింది. ప్రస్తుతం అసోంలోని బిజెపి నేతృత్వ ప్రభుత్వానికి ముఖ్యమంత్రిగా వున్న శర్వానంద సోనోవాల్ గతంలో ఎజిపి నాయకుడే. 2011లో ఆయన బిజెపికి ఫిరాయించారు. ఈనాడు ఎజిపి పరిస్థితి చాలా పేలవంగా వుంది. బిజెపి ప్రభుత్వంలో కేవలం భాగస్వామిగా కూర్చోవడం తప్ప మరో పాత్ర లేకుండా పోయింది.

ఆంధ్ర ప్రదేశ్‌లోని తెలుగుదేశం, ఉత్తరప్రదేశ్‌లోని బహుజన సమాజ్ పార్టీలు బిజెపితో పొత్తు పెట్టుకుని మూల్యం చెల్లించుకున్నాయి. గత లోక్‌సభ ఎన్నికలు ముందుగా బిజెపితో తెలుగుదేశం సంబంధాలు తెగతెంపులు చేసుకున్నపుడు కొద్దిమంది ఎంపీలు బిజెపికి ఫిరాయించడం చూశాం. గతంలో బిజెపితో వున్న పొత్తు వల్ల దళితులు, బహుజనుల వాణిగా బిఎస్‌పికి వున్న పేరు ప్రతిష్టలు క్షీణించాయి. పశ్చిమ బెంగాల్‌లోని తృణమూల్ కాంగ్రెస్ వాజ్‌పేయి ప్రభుత్వంలో భాగస్వామి, 1999 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపితో పొత్తు పెట్టుకుంది.

తీవ్రంగా భయానక పరిస్థితులను సృష్టించడం ద్వారా, వామపక్షాలపై భౌతిక దాడులకు దిగడం ద్వారా బిజెపి ఎదుగుదలకు వీలు కల్పించింది. బెంగాల్ రాజకీయాల్లో మతోన్మాద భూతాన్ని పెంచి పోషించిన తర్వాత మమతా బెనర్జీ అప్పుడు బిజెపి ప్రభుత్వంలో మంత్రిత్వ శాఖలను పొందింది.

ఒడిషాలో నవీన్ పట్నాయక్ నేతృత్వం లోని బిజూ జనతాదళ్ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌మోహన్ రెడ్డి వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వం కేంద్రం లోని మోడీ సర్కార్‌కు సహకారం అందిస్తున్నాయి. పార్లమెంట్ చివరి సమావేశంలో ఆమోదించిన మూడు వ్యవసాయ బిల్లులతో సహా మోడీ సర్కార్ తీసుకు వచ్చిన ప్రధానమైన చట్టాలన్నింటికీ వారు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మద్దతిస్తూనే వున్నారు.

ఒడిషాలో బిజెడికి ప్రధాన ప్రతిపక్షంగా బిజెపి ఇప్పటికే ఆవిర్భవించింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తంగా బిజెడిని ఓడించడానికి చూస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ఆర్‌సిపి, తెలుగుదేశం పార్టీలు బిజెపి మెప్పును పొందడానికి ప్రయత్నిస్తున్నాయి. ఇటువంటి కపట రాజకీయాలకు చెల్లించాల్సిన మూల్యం ఎంతనేదానితో నిమిత్తం లేకుండా ఈ రెండు పార్టీలు పోటీ పడుతున్నాయి.

ఈ పార్టీలు, ప్రభుత్వాల్లో కొన్ని సిబిఐ, ఇ.డి వంటి కేంద్ర దర్యాప్తు సంస్థల నుండి నిరంతర ముప్పు ఎదుర్కొంటున్నాయి. ఆ కారణంగానే, మోడీ ప్రభుత్వం రాష్ట్రాల హక్కులపై తీవ్రంగా దాడి చేసినా, సమాఖ్య నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా ఆ నిరంకుశ చర్యల పట్ల వీరు మౌనం వహిస్తున్నారు. ఏక పార్టీ– బిజెపి ఆధిపత్యమున్న ఈ కొత్త శకం విసిరిన సవాలుతో ఎదురైన సంక్షోభంలో ప్రాంతీయ పార్టీలు వున్నాయి.

కాంగ్రెస్‌పై పోరాడడం ద్వారా అనేక ప్రాంతీయ పార్టీలు వృద్ధి చెందాయి. కాంగ్రెస్‌ను ఓడించడం ద్వారా అనేక పార్టీలు అధికారంలోకి వచ్చాయి. డిఎంకె, టిడిపి, ఎజిపి, బిజెడి, అకాలీలు ఇవన్నీ ఈ కోవ లోకే వస్తాయి. బిజెపి గుత్తాధిపత్య శక్తిగా ఆవిర్భవించినప్పటికీ డిఎంకె మినహా ఈ పార్టీలన్నీ కొత్త వాస్తవిక పరిస్థితులకు అనుగుణంగా తమని తాము మార్చుకోలేకపోతున్నాయి. ఇంకా పాత రాజకీయాల చట్ర పరిధి లోనే కొట్టుకుంటున్నాయి. ఫలితంగా, ఈ రాష్ట్రాల్లో పలువాటిల్లో కాంగ్రెస్ క్షీణించడంతో సంబంధిత ప్రధాన ప్రాంతీయ పార్టీ నుండి పెద్దగా ప్రతిఘటన లేకుండానే బిజెపి ఈ ఖాళీని భర్తీ చేయగలుగుతోంది.

అంటే తమ పాత శత్రువు కాంగ్రెస్‌తో ఈ ప్రాంతీయ పార్టీలు చేతులు కలపాలని కాదర్థం. బిజెపిని తమ ప్రధాన ప్రత్యర్థిగా గుర్తించి, దానికి వ్యతిరేకంగా పని చేయాలని అర్థం.

కేంద్రంలోని నిరంకుశ బిజెపి ప్రభుత్వాన్ని వ్యతిరేకించరాదన్న తమ వైఖరి కారణంగానే నలు వైపుల నుండి బిజెపి పాల్పడుతున్న దాడులకు లక్ష్యాలుగా మారుతున్నారు. మోడీ ప్రభుత్వంతో రాజీ పడిపోయి హిందూత్వ రాజకీయాలను ప్రతిఘటించడానికి తిరస్కరిస్తున్న ప్రాంతీయ పార్టీలు ఒక విషయాన్ని గుర్తించాల్సి వుంది. బిజెపితో పొత్తు పెట్టుకుని, మోడీ ప్రభుత్వంలో భాగస్వామిగా వున్న ప్రాంతీయ పార్టీలకు ఏ గతి పట్టిందో తెలుసుకుని వాటి నుండి గుణపాఠాలు నేర్చుకోవాలి. ఎన్‌డిఎలో దీర్ఘకాలం మిత్రులుగా వున్న శివసేన, అకాలీదళ్...ప్రభుత్వం నుండి, పొత్తు నుండి బయటకు వచ్చేశాయి. నితీష్ కుమార్‌ను బలహీనపరిచేందుకు ఎన్‌డిఎ మరో మిత్రపక్షమైన లోక్ జనశక్తి పార్టీని బిజెపి ఉపయోగించడంతో బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో జెడి(యు), నితీష్ కుమార్‌ల ప్రభావం తగ్గింది. తన సంపూర్ణ గుత్తాధిపత్యాన్ని స్థాపించుకునేందుకు బిజెపి సిద్ధంగా వుంది. తన మిత్రపక్షాలన్నింటినీ పూర్తిగా అణచివేయడానికి సిద్ధంగా వుంది. సమాజాన్ని సజాతీయం చేయాలన్నది ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యంగా వుంది. వైవిధ్య భరితమైన సామాజిక, సాంస్కృతిక, ప్రాంతీయ గుర్తింపులన్నీ హిందూత్వ కారణంగా పొగచూరిపోతున్నాయి. ఇది ప్రాంతీయ పార్టీల మనుగడకు ముప్పుగా పరిణమిస్తోంది.

ఇక్కడ ప్రాంతీయ పార్టీలు ఎంచుకోవాల్సిన మార్గం ఏంటనేది చాలా స్పష్టంగా వుంది. రాజకీయంగా, సైద్ధాంతికంగా బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్‌పై పోరు సల్పడం లేదా, లొంగిపోయి, కనిపించకుండా పోవడమో తేల్చుకోవాలి. ప్రజాస్వామ్యం, ఫెడరలిజం కాపాడడం కోసం ప్రాంతీయ పార్టీలకు కీలకమైన అవకాశం వుంది.

**– 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం 4.12.2020**

ప్రచురణ

ప్రజాశక్తి బుక్‌హౌస్

ప్రజాశక్తి భవన్, అమరారెడ్డి కాలనీ, అరవిందా హైస్కూల్ వద్ద
తాడేపల్లి – 522 501. ఫోన్ : 94900 99057